క్లుప్తంగా

జనవరి 3న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను జనవరి 3వ తేదీన శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు డీఈఓ కేవీఎస్.కుమార్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా నేడు మండల స్థాయి పోటీలను ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీలకు హాజరవ్వాలని వారు సూచించారు.

ప్రతి అర్జీకి పరిష్కారం


ట్రైసైకిల్‌ను అందిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపించే దిశగా అధికారులు పని చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ చేపట్టారు. కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 284 అర్జీలు వచ్చాయి. శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు పంచాయతీ పరిధిలోని ఈశ్వరయ్య కాలనీకి చెందిన గబ్బా వెంకటేశ్వరరావు పుట్టుకతోనే విభిన్న ప్రతిభావంతుడు. ఈ నేపథ్యంలో ఆయనకు ఓ ట్రైసైకిల్‌ను అందించారు. వారితోపాటు ప్రతిభావంతుల శాఖ పర్యవేక్షకులు వినోద్ ఉన్నారు.

పోలీసుల తీరు ఆక్షేపణీయం

తిరుపతి లీగల్: రాష్ట్రంలో రెండు వేరువేరు చోట్ల పోలీసులు వ్యవహరించిన తీరు మానవ హక్కుల ఉల్లంఘన అని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు నరహరెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు దొరబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతి చెందడం బాధాకరమన్నారు. న్యాయవాది పట్ల పోలీస్ అధికారి వ్యవహరించిన తీరు వల్లే గుండె పోటుతో న్యాయవాది మృతి చెందినట్టు ఆయన ఆరోపించారు. అలాగే అన్నమయ్య జిల్లా గాలివీడులో మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి పట్ల పోలీస్ అధికారి వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. తిరుపతి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి విజయకుమార్ ఇతర న్యాయవాదులు ఐ.చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ కుమార్, రాజశేఖర్, పురుషోత్తంరెడ్డి, అక్బర్ బాషా, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

తిరుపతి లీగల్ : రాష్ట్రంలో వేర్వేరు చోట్ల న్యాయవాదులపై పోలీసుల అనుచిత ప్రవర్తనకు నిరసనగా మంగళవారం కోర్టు విధులకు హాజరు కాకూడదని తీర్మానించినట్టు తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి గోపీచంద్ తెలిపారు.

సిరిసిటీ!

శ్రీసిటీ ప్రగతికి కలిసొచ్చిన 2024

- పటిష్టమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకో సిస్టమ్)
- రూ. 3,750కోట్ల నూతన పెట్టుబడులు రాక
- తద్వారా 17వేల మందికి ఉపాధి
- 16 నూతన పరిశ్రమలు స్థాపన, మరో 9 పరిశ్రమలు విస్తరణ
- నిర్మాణ దశలో ఇంకో 9 పరిశ్రమలు
- రూ.3కోట్ల సీఎస్ఆర్ నిధులతో పలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): దేశంలోని అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటైన శ్రీసిటీ పారిశ్రామిక వాడకు 2024 కలిసొచ్చింది. ఈ కేంద్రంలో పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకో సిస్టమ్) మరింత పటిష్టం కావడంతో ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలతో పాటు ఇక్కడ నెలకొన్న తయారీదారు, కస్టమర్, సరఫరాదారు గొలుసుకట్టు పారిశ్రామిక అనుకూల వాతావరణం పారిశ్రామికవేత్తలను శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనకు మొగ్గుచూపేలా ప్రోత్సహిస్తోంది. ఆ మేరకు ఈప్యాక్ డ్యూరబుల్ ఇండియా, ఎలక్ట్రానిక్స్ గృహోపకరణ ఉత్పత్తుల పరిశ్రమ తన ఉత్పత్తులను శ్రీసిటీలోని హావెల్స్, డైకిన్, ఇతర ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు సరఫరా చేస్తోంది.

2024లో 3,750 కోట్ల పెట్టుబడి

శ్రీసిటీ ప్రగతి ప్రస్థానంలో 2024 ఏడాదిలో పటిష్టమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ మరింత వృద్ధి చెందింది. తద్వారా రూ.3,750 కోట్ల నూతన పెట్టుబడులకు ఈ ఏడాది తోడైంది. ఆ దిశగా ఈ ఏడాదిలో 16 నూతన పరిశ్రమలను స్థాపించారు. మరో 9 పరిశ్రమలు విస్తరణ దిశగా అడుగులు వేశాయి. ఇంకా 9 పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. తద్వారా 17 వేల మందికి ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లభించాయి. అలాగే రూ.3.08 కోట్ల కమ్యూనిటీ సోషల్ రెస్పాంసిబిలిటీ (సీఎస్ఆర్)నిధులతో పలు పాఠశాలలు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.


శ్రీసిటీలో తయారైన ఉత్పత్తుల గురించి తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

కూల్ క్యాపిటల్‌గా ఆవిర్భావం

గత ప్రభుత్వ ప్రోత్సాహంతో శ్రీసిటీ కూల్ క్యాపిటల్‌గా విస్తరించింది. ఆ దిశగా డైకిన్, బ్లూస్టార్, యాంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, హావెల్స్ వంటి ప్రముఖ ఏసీ పరిశ్రమలు ఏర్పాటుతో పాటు వీటికి వివిధ ఉపపరికరాలు సరఫరా చేసే నిడెక్ వంటి అనుబంధ కంపెనీలు రావడంతో దేశంలోనే ఎయిర్ కండీషనర్ తయారీ కేంద్రంగా, కూల్ క్యాపిటల్‌గా శ్రీసిటీ విస్తరిస్తోంది.

సుస్థిరతకు పెద్దపీట

పర్యావరణ నిర్వహణలో శ్రీసిటీ నిబద్ధత, అమలు విధానాలు, అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. ఈ చర్యలో భాగంగా చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పలు వినూత్న కార్యక్రమాలకు గుర్తింపుగా పలు అవార్డులు సొంతం చేసుకుంది.

ప్రశంసలు, గుర్తింపులు

హెరాల్డ్ గ్లోబల్ ఇంటర్నేషనల్ బ్రాండ్ అడ్వర్టైజింగ్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ (బ్రాండ్ ఆఫ్ ది డీకేడ్) అవార్డు, ముంబైలో నిర్వహించిన గోల్ ఫెస్ట్ కాన్‌క్లేవ్ 2024, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ (సీఐఐ) సంస్థ వారి సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డు దక్కాయి. అలాగే శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్, ఐఎఫ్ఎఫ్, టాటా స్మార్ట్ ఫుడ్స్, యాక్సెంచర్ ఫార్మా, మ్యాంగో రిసార్ట్స్ పరిశ్రమలు వాటి ప్రత్యేకతలకు గాను అవార్డులు అందుకున్నాయి.

2024లో జరిగిన ముఖ్య ఘటనలు

- గత ఆగస్టు 19న ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్‌తో కలిసి శ్రీసిటీ ప్రగతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగాయి. వీటితో పాటు శ్రీసిటీలో నూతనంగా నిర్మించనున్న ఫైర్ స్టేషన్‌కు అధునాతన నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు.
- మార్చి 6న మిజోరాం గవర్నర్ కంబంపాటి హరిబాబు శ్రీసిటీని సందర్శించి పారిశ్రామిక ప్రగతి ఉపాధి కల్పన, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు.
- నవంబర్ 14న నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం శ్రీసిటీని సందర్శించారు.
- అక్టోబర్ 29న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి టీజీ భరత్ శ్రీసిటీలో పరిశ్రమల ప్రధాన కార్యనిర్వాహకులు (సీఈఓలు), ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం 4.0 తీరుతెన్నులను వివరించారు.
- డిసెంబర్ 18న ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమలో ఉత్పత్తైన వాహనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

సామాజిక బాధ్యత

- శ్రీసిటీ, వివిధ పరిశ్రమలు సామాజిక సంక్షేమం పట్ల తమ నిబద్ధతను ప్రదర్శిస్తూ వరద సహాయక కార్యక్రమాలకు మద్దతుగా జిల్లా విపత్తు సహాయ నిధికి రూ.కోటి విరాళం అందించింది.
- పరిసర ప్రాంత సామాజిక అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.3.08 కోట్లకు పైగా ఖర్చు పెట్టింది.
- శ్రీసిటీ జపనీస్ పరిశ్రమల అసోసియేషన్ (ఎస్‌జేసీఏ) పార్కసస్ ప్యాకేజింగ్, యూనిఛామ్, ప్రికాల్, ఇసుజు మోటార్స్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఐఎంటీపీ, హామిల్టన్ పరిశ్రమలు రూ.3.08 కోట్లకు పైగా సీఎస్ఆర్ ప్రాజెక్టుల ద్వారా విద్యా, ఆరోగ్య సంరక్షణ, సామాజిక అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాయి.

2024 ముఖ్యమైన ఏడాది

శ్రీసిటీ ప్రస్థానంలో 2024 సంవత్సరానికి ఒక ముఖ్యమైన ఏడాదిగా చెప్పుకోవాలి. ఇందులో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. ఇదే స్ఫూర్తితో 2025లోనూ నూతన పరిశ్రమలు, పెట్టుబడులు, ఇతర కార్యకలాపాలకు అత్యంత కీలకంగా భావించి ముందుకెళ్తాం. ఈ ఏడాది కూడా అంతా మంచే జరగాలని ఆశిస్తున్నా.

– డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీసిటీ

38 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న 38 మందికి ఒక్కొక్కరికీ పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎస్వీ.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆదేశాల మేరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్ట్ కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. 2024 సంవత్సరంలో అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 84 మందికి జైలు శిక్ష, ఒక్కొక్కరికీ పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు కోర్టు కానిస్టేబుల్ తెలిపారు. అలాగే తక్కువ మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 1,322 మందికి ఒక్కొక్కరికీ 10 వేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. జరిమానాల రూపంలో ఒక కోటి 37 లక్షల 50 వేల రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్టు ఆయన తెలిపారు.

ప్రొఫెసర్ సస్పెన్షన్


ఉమామహేష్

తిరుపతి సిటీ: ఎస్వీ వ్యవసాయ కళాశాల క్రాప్ ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ వీ.ఉమామహేష్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్వీరంగా వర్సిటీ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేశారు. తిరుపతి న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించిన నేపథ్యంలో ఉద్యోగుల క్రమశిక్షణా నియమనిబంధనల ప్రకారం వర్సిటీ అధికారులు ఆయనపై సస్పెన్స్ వేటు వేశారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

తిరుపతి సిటీ: ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా నూతన విద్యావిధానం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని విక్రమ సింహపురి వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ సోషల్‌వర్క్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ఎన్ఈపీ–2020పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె విభాగపు హెచ్ఓడీ ప్రొఫెసర్ తవిత తులసితో కలసి పాల్గొని ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో అకడమిక్ విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక ఫోకస్ ఉంటుందన్నారు. ప్రొఫెసర్ ఐవీ లలితకుమారి పాల్గొన్నారు


మహిళా వర్సిటీలో ప్రసంగిస్తున్న అతిథులు

ఎస్వీయూలో జాతీయ విద్యావిధానంపై సదస్సు

ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్, సోషియల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానం 2020 ఆపర్చునిటీస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ సుధారాణి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి ఎన్ఈపీ–2020 దోహదపడుతుందన్నారు. విభాగాధిపతి ప్రొఫెసర్ సాయి సుజాత, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య, సీడీసీ డీన్ ఆచార్య చంద్రాయుడు, మహిళా వర్సిటీ ప్రొఫెసర్ ఐవీ లలితకుమారి, అధ్యాపకులు డాక్టర్ రీనా, సునీల్ కుమార్, కోదండరామిరెడ్డి, పార్థసారథి, శివప్ప, జగదీశ్వరి, రాజేశ్వరి, రమణ, సునీత, శ్రీలత, కిషోర్ పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ముద్రించిన 2025వ సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను సోమవారం డీఈఓ కార్యాలయం ఆవరణలో పాఠశాల విద్య ఆర్జేడీ కె.శామ్యూల్, డీఈఓ కేవీఎస్ కుమార్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి మాట్లాడుతూ జనవరి 5 నుంచి కాకినాడలో నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిర్మల, దండు రామచంద్రయ్య, కుమారస్వామి, కె.మోహన్‌బాబు పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ, డీఈఓ

2024 సైబర్ టెర్రర్



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

- వార్షిక నేరాల గణాంకాలను వివరించిన జిల్లా ఎస్పీ

తిరుపతి క్రైం: సైబర్ నేరగాళ్లు 2024లో హడలెత్తించారు. అమానవీయ ఘటనలు ఉలిక్కిపాటుకు గురిచేశాయి. వ్యవస్థీకృత నేరాలు సవాలుగా మారాయి. వీటి కట్టడికి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ఎప్పటికప్పుడు సాంకేతికత తోడుగా కేసుల ఛేదనకు ప్రయత్నిస్తున్నా సైబర్ నేరాలు, చోరీలు, గొలుసు దొంగతనాలు, అత్యాచారాలు వంటివి ఆగడం లేదు. ఈ ఏడాది ముగ్గురు ఎస్పీలు బదిలీ అయ్యారు. ప్రస్తుతం సుబ్బరాయుడు ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2024 సంవత్సరానికి ముగింపు పలికేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో పోలీసు శాఖ జిల్లా వార్షిక నివేదికను సోమవారం జిల్లా ఎస్పీ విడుదల చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జరిగిన సైబర్ నేరాల కేసులు చూస్తే భయమేస్తోంది. ఇక రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తసిక్తమయ్యాయి.

రక్తమోడిన రహదారులు

జిల్లాలో సగటున రోజుకు రెండు, మూడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జిల్లా మీదుగా కీలకమైన జాతీయ రాష్ట్ర రహదారులు వెళ్తున్నాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం తదితర కారణాలతో జిల్లాలోని ప్రధాన రహదారులు నిత్యం నెత్తురోడుతున్నాయి. గతేడాది 1,039 రోడ్డు ప్రమాదాలు జరగగా, ఈ ఏడాది వాటి సంఖ్య 1015కు చేరింది.

దొంగల హల్‌చల్

జిల్లాలో చోరీలు ఆందోళన కలిగిస్తున్నాయి. దొంగతనాలు గతేడాదితో పోలిస్తే తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నా బాధితులు పోగొట్టుకున్న సొమ్ము కోట్లలోనే ఉంటోంది. 2023లో అన్ని రకాల చోరీలు 993 చోటు చేసుకోగా ఈ ఏడాది నవంబర్ వరకు 983 చోరీలు జరిగాయి. అదేవిధంగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆరు హత్య కేసులు పెరిగాయని ఎస్పీ పేర్కొన్నారు. హత్యలన్నీ కూడా అక్రమ సంబంధాలు, ఆస్తి తగదా వల్ల జరిగినవే. మిస్సింగ్ కేసుల్లో కూడా 98 శాతం గుర్తించారు.

జిల్లాలో మొత్తం నేరాలు

నేరాలు	2023లో	2024లో
దేహ సంబంధిత	933	921
ఆస్తి సంబంధిత	993	983
రోడ్డు ప్రమాదాలు	1,039	1,015
సైబర్ నేరాలు	173	248
వైట్ కాలర్ నేరాలు	336	312
ఇతర నేరాలు	2,651	2,217

మత్తుకుంటున్నా వినరే!

జిల్లాలో గంజాయి వినియోగం పెరిగింది. ఈ ఏడాది 85 కేసుల్లో దాదాపు 223 మంది గంజాయి అక్రమ రవాణా, విక్రయదారులను అరెస్టు చేశారు. వారి నుంచి 8,72,307 కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఇందులో 239 మంది నేరస్తులపై గాంజా షీట్స్‌ను ఓపెన్ చేశారు. మొబైల్ హ్యాండ్ ద్వారా ఇప్పటివరకు రూ.7.56 కోట్ల విలువచేసే 4,275 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. రూ.36 లక్షల అనధికార మద్యం బాటిళ్లను రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు.

వల వేసి.. ఖాతాలు ఊడ్చేసి

ఈ ఏడాది జిల్లాలో సైబర్ నేరగాళ్లు అందినకాడికి దోచుకున్నారు. కొందరి అత్యాశను సైబర్ నేరగాళ్లు అనుకూలంగా మార్చుకున్నారు. నకిలీ లింకులు పంపుతూ ఓటీపీ చెప్పమని నమ్మబలుకుతూ ప్రజల సొమ్మును ఖాతాల్లో నుంచి దోచేశారు. ప్రజలు సైబర్ మోసాల బారినపడకుండా పోలీసు శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉండడం ఆందోళనకరం. గత ఏడాది 173 సైబర్ కేసులు నమోదు కాగా.. రెండు కోట్ల 44 లక్షల రూపాయల వరకు మోసపోయారు. ఇందులో 84 లక్షల ఎనిమిది వేల రూపాయలు పోలీసులు రికవరీ చేశారు. 2024లో 248 కేసులు నమోదయ్యాయి. 12 కోట్ల 89 లక్షలు రూపాయలు పోగొట్టుకోగా.. రెండు కోట్ల 36 లక్షల వరకు రికవరీ చేశారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం


హారతి పడుతున్న అర్చకులు

తిరుమల : తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో 25 రోజుల పాటు జరగనున్న అధ్యయనోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు రంగనాయకుల మండపంలో అధ్యయనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుంచి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, శ్రీవారి ఆలయ పేష్కర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికీ ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ ఆరు లక్షల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం సెషన్స్ కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ అధికారి రాజగోపాల్ రెడ్డి, కోర్ట్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. 2016 డిసెంబర్ 23వ తేదీ భాకరాపేట పోలీసులు చిన్నగొట్టిగల్లు మండలం, భూతంవారిపల్లి బస్‌స్టాప్ వద్ద వాహనాలను తనిఖీ చేయగా ఓ ఆటోలో 4 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పీలేరు మండలం, రేగల్లు, బోయపల్లికి చెందిన ఆటో డ్రైవర్ లింగం అశోక్, పీలేరు, ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన పులికంటి క్రాంతికుమార్ అలియాస్ క్రాంతి పోలీసులకు పట్టుబడ్డారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధించారు.

సంద్రమా..ఊపిరి పీల్చుకో

– రెండు నెలల తర్వాత సాగర కెరటాలపై రవి కిరణాలు


తూపిలిపాలెం వద్ద వేటకు వెళుతున్న మత్స్యకారులు

వాకాడు: బంగాళాఖాతంలో వరుస తుపాన్ల కారణంగా రెండు నెలలుగా సాగర కెరటాలపై వెచ్చని రవి కిరణాల జాడ కనిపించ లేదు. ఇన్నాళ్లు చలి గాలులతో గజగజ వణికిపోయిన తీర ప్రాంత ప్రజలు రెండ్రోజులుగా వాతావరణం కాస్త అనుకూలించడంతో ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం వాకాడు మండలం, తూపిలిపాళెం సముద్ర తీరంలో రవికిరణాల జాడ కనిపించింది. కిరణాలు జగతిని హత్తుకునే విధంగా ఉదయించడంతో ప్రకృతి ప్రేమికులు పరవశించి పోయారు. గంగ పుత్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. సామగ్రిని సర్దుకుని తూర్పు దిశగా వేటకు బయలుదేరారు.

ఎన్ఎస్‌యూను సందర్శించిన ఒడిశా స్పీకర్


ఒడిశా స్పీకర్‌ను సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఒడిశా రాష్ట్ర స్పీకర్ సురమపాడి సోమవారం జాతీయ సంస్కృత వర్సిటీలోని ఉత్కల పరిషత్‌ను సందర్శించారు. అనంతరం సమీకాలీన సమాజానికి శ్రీ జగన్నథ సంస్కృతితో భగవద్గీత ఔచిత్యంపై జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్కల పీఠం ద్వారా జయదేవ సాహిత్యం, జగన్నాథ సంస్కృతిపై పరిశోధనలు చేయడం హర్షణీయమన్నారు. సంస్కృతభాషను, భారతీయ సంస్కృతిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమశ్రీ, వర్సిటీ అధికారులు ఆమెను జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

బస్సు కింద పడి యువకుడి మృతి

తిరుపతి క్రైం: నగరంలోని రేణిగుంట రోడ్‌లో బస్సు కిందపడి యువకుడు మృతి చెందిన ఘట న ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం.. ఒడిశాకు చెందిన హరీష్ (18) వారి అన్న హరికృష్ణతో కలిసి కాటన్ మిల్ రైల్వే గేట్ వద్ద బస్సును ఓవర్ టేక్ చేయబోయారు. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన బస్సు వెనుక చక్రం కింద పడి హరీష్ అక్కడికక్కడే మృతి చెందగా.. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న హరికృష్ణ స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చేరాడు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. అలిపిరి పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

సమయపాలన తప్పనిసరి

తిరుపతి తుడా : సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, తప్పనిసరిగా సమయపాలన పాటించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. సోమవారం ఈ మేరకు అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. సచివాలయ కార్యదర్శుల హాజరు నమోదును పరిశీలించి, అందుబాటులో లేని వారిపై చర్యలకు ఆదేశించారు. అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర,, మేనేజర్ హసీమ్, ఏసీపీ బాలాజీ పాల్గొన్నారు.

వినతులకు ప్రాధాన్యం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతులకు ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 30 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

తిరుమలలో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

తిరుమల : తిరుమలలో జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు జరిగే పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి, సీవీఎస్వో శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈఓ టీటీడీ అధికారులు, పోలీసులకు వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. వైకుంఠ ఏకాదశి, వైకుంఠ ద్వాదశి రోజుల్లో పోలీసుల సమన్వయంతో తిరుమలలో ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనాల రద్దీని నివారించడానికి పార్కింగ్ స్లాట్‌లను వికేంద్రీకరించాలని, దాదాపు 13,000 వాహనాల కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, ఇతర టీటీడీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆదిఆంధ్ర అంటే మాదిగలే!


కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు నరేంద్రబాబు మాదిగ, పులికుంట్ల గోపీ మాదిగ

తిరుపతి అర్బన్: జిల్లాలో ఆదిఆంధ్ర పేరుతో ఉండే ఎస్సీలు మాదిగ కులానికి చెందినవారేనని ఎంఆర్‌పీఎస్ జాతీయ నేతలు నరేంద్రబాబు మాదిగ, పులికుంట్ల గోపి మాదిగ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా ఎంఆర్‌పీఎస్‌కు చెందిన నేతలు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన వారు ఎస్సీ–ఏ, ఎస్సీ–బీ, ఎస్సీ–సీ, ఎసీ–డీగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ క్రమంలో మాలలు ఎస్సీ–సీలోను, మాదిగలు ఎస్సీ–బీలో ఉన్నారని తెలిపారు. అయితే తిరుపతి జిల్లాలో ఆది ఆంధ్ర పేరుతో మాదిగలను ఎస్సీ–డీలో ఉంచారని ఆవేదన చెందారు. ఆది ఆంధ్రకు చెందిన వారు మాదిగలేనని వారిని ఎస్సీ–బీలో చేర్చాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ నేతలు వాసుదేవరావు, వేలూరు రాజేంద్ర, వావిళ్ల శివయ్య, నవీన్‌కుమార్, పరమాల మునువేలు, బోయినపల్లి రవి, సంగీతం రామ్మూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిగత కార్యదర్శికి పరామర్శ



ముఖేష్‌ను పరామర్శిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన వ్యక్తిగత కార్యదర్శి ముఖేష్‌ను వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ముఖేష్‌కు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి



ఆలయం వెలుపల కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కుటుంబ సభ్యులతో కలసి సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రసాద్ స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం



ట్రోఫీ అందిస్తున్న సీఐ తమీమ్ అహ్మద్

తిరుపతి కల్చరల్ : క్రీడలతో మానసిక ఆరోగ్యం పొందవచ్చని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.తమీమ్ అహ్మద్ తెలిపారు. భాష్యం ప్రీమియర్ లీగ్‌లో భాగంగా తుమ్మలగుంట కేవీఎస్ గ్రౌండ్‌లో సోమవారం జోనల్ క్రికెట్ సెమీ ఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించారు. విన్నర్‌గా వెంకటగిరి శాఖ, రన్నర్‌గా పుంగనూరు శాఖ నిలిచాయి. విజేతలకు సీఐ తమీమ్ అహ్మద్ బహుతులు ప్రదానం చేశారు. జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పాల్గొన్నారు.

అందుబాటులో మందులు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. 'రుయా.. మందులు లేవయా' శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు.

విద్యార్థులకు సాయం

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని బాలుర వసతి గృహంలో విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేసినట్లు ప్రజా సాధికారిక ట్రస్ట్ అధ్యక్షుడు బాలాజీ సోమవారం తెలిపారు.శివయ్య ఫ్రూట్ మర్చంట్ వారి సహకారంతో పిల్లలకు సాయం చేసినట్లు వెల్లడించారు.

టౌన్‌బ్యాంక్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ (టౌన్‌బ్యాంక్) 2025 సంవత్సర క్యాలెండర్‌ను బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, మహ్మద్ ఖాసిమ్, కడపగుంట అమరనాథరెడ్డి, మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, వెంకటేష్ రాయల్, చంద్రయ్య, అధికారులు శివకుమార్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

'ముంతాజ్' నిర్మాణంపై నిరసన

తిరుపతి అర్బన్ : పేరూరు పంచాయతీలో ముంతాజ్ హోటల్ నిర్మాణంపై తిరుక్షేత్రాల పరిరక్షణ సమితి నేతలు నిరసన తెలిపారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తుమ్మ ఓంకార్, కిరణ్, సుధాకర్ చౌదరి, రెడ్డిశేఖర్ రాయల్, రమాదేవి,, నీలకంఠ, మధు, గోకుల్ ,బాబు, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

అనుమతి లేని దుకాణాలపై ఫిర్యాదు



వినతిపత్రం అందిస్తున్న న్యాయ విద్యార్థులు

తిరుపతి అర్బన్ : నగరంలో ఎలాంటి అనుమతుల లేకుండా నిర్వహిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని జాతీయ న్యాయ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుందరరాజు కోరారు. సోమవారం ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రవితేజ, రాము, ముఖేష్, యోగేష్ పాల్గొన్నారు

ఆధ్యాత్మికం



తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయం నూతన శోభను సంతరించుకుంది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వేలాదిగా తరలిరానున్న భక్తుల కోసం ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను సిద్ధం చేశారు. - తిరుపతి రూరల్

అభినందన




ఫిట్ ఇండియా వీక్ ఫెస్టివల్‌లో భాగంగా ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి సోమవారం వరకు విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను వీసీ రాణి సదాశివమూర్తి అభినందించారు. బహుమతులు అందించారు. రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి, భారత శేఖరాచార్యులు, నీలకంఠం, మూర్తి, మోహిత్ చంద్ర పరాగి పాల్గొన్నారు. - తిరుపతి సిటీ

అభిమానం



నూతన సంవత్సరానికి స్వాగతం పలికే క్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రత్యేక అభిమానం ప్రదర్శించారు. తిలక్‌రోడ్డులోని బ్లూపెటల్స్ దుకాణంలో వినూత్నంగా ఫ్లవర్ బొకేను సిద్ధం చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత చిత్రపటంతో విశేష పుష్పాలతో గుచ్ఛం తయారు చేసి విక్రయానికి అందుబాటులో ఉంచారు. సరికొత్త ఆలోచనతో తీర్చిదిద్దిన బోకేపై వినియోగదారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. - తిరుపతి తుడా

గ్రీటింగ్.. న్యూ ట్రెండ్!



- డిజిటల్ విషెస్‌తో కొత్త ఏడాదికి స్వాగతం
- కనిపించని గ్రీటింగ్ కార్డుల విధానం
- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ వేదికగా శుభాకాంక్షల పర్వం
- పాత పద్ధతే మధురమంటున్న పోస్టల్ యంత్రాంగం



ఆకర్షణీయంగా.. కలర్‌ఫుల్‌గా.. మనసులోని భావాలను ప్రతిబింబించేలా.. అందమైన గ్రీటింగ్ కార్డులతో ఒకప్పుడు నూతన సంవత్సరానికి స్వాగతం పలికేవారు. పండుగలు.. పుట్టినరోజు వేడుకలకు శుభాకాంక్షలు తెలిపేవారు. ఈ క్రమంలోనే పోస్టల్ సిబ్బంది సైతం కొత్త ఏడాది సందర్భంగా కార్డుల పంపిణీలో బిజీ బిజీగా ఉండేవారు. అయితే ప్రస్తుతం ట్రెండ్ మారింది. చిన్నా.. పెద్దా తేడా లేకుండా బంధుమిత్రులకు సెల్‌ఫోన్ నుంచే విషెస్ చెప్పేస్తున్నారు. ఇందుకోసం వాట్సాప్.. ఫేస్‌బుక్.. ఎక్స్.. ఇన్‌స్టాను వినియోగించుకుంటున్నారు.

తిరుపతి సిటీ : న్యూ ఇయర్, పండుగలకు శుభాకాంక్షలు తెలిపే వారధిగా గ్రీటింగ్ కార్డులకు ప్రత్యేక స్థానం ఉండేది. అప్పట్లో ప్రతి ఒక్కరూ తమ స్థాయిని మేరకు కార్డులను కొనుగోలు చేసి తమ బంధుమిత్రులకు నేరుగా, పోస్ట్ ద్వారా అందజేసి ఆత్మీయతను చాటుకునేవారు. ప్రత్యేకంగా ప్రేమికుల గ్రీటింగ్ కార్డులకు స్పెషల్ క్రేజ్ ఉండేది. సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న ఆధునిక యుగంలో గ్రీటింగ్ కార్డులు కాలగర్భంలో కలిసిపోయాయి.

బాక్సులు నిండిపోయేవి

నూతన ఏడాది వస్తోందంటే పోస్టల్ సిబ్బంది న్యూఇయర్ గ్రీటింగ్ కార్డులు, ఉత్తరాలతో బిజీబిజీగా ఉండేవారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వెలిసిన పోస్టబాక్సులు నిండిపోయేవి. 1965 నుంచి 1972వరకు ప్రజలు ఉత్తరాలతో పండుగ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకునేవారు. 1972 నుంచి పోస్ట్‌కార్డు సైజ్‌లో కలర్ ప్రింట్‌లతో ప్రత్యేకంగా నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డులు ప్రవేశించాయి. తొలి రోజుల్లో పట్టణాలకే పరిమితమైన ఈ సంస్కృతి 1985 నుంచి గ్రామీణ ప్రాంతాలకు పాకింది. సెల్‌ఫోన్ యుగం ప్రారంభమైనా సరే యువతకు గ్రీటింగ్ కార్డులపై మక్కువ పోలేదు. 2012వరకు గ్రీటింగ్ కార్డులు, మెసెంజర్ల యుగం నడిచింది. ఆతర్వాత ట్రెండ్ మారింది. స్మార్ట్ ఫోన్‌ల రాకతో గ్రీటింగ్ కార్డులు కాలగర్భంలో కలిసిపోయాయి.

కార్డులకు తగ్గిన క్రేజ్

ఒకప్పుడు నూతన ఏడాది సమీపిస్తుంటే గ్రీటింగ్ కార్డుల దుకాణాలు కళకళలాడేతుండేవి. ప్రత్యేక మెసేజ్‌లతో కార్డులు అందుబాటుల ఉండేవి. కవితలతో పాటు, మ్యూజిక్ కార్డులను ప్రత్యేకంగా ముద్రించి యువతను ఆకట్టుకునేలా తయారు చేసేవారు. విజిటింగ్ కార్డు సైజ్ నుంచి పోస్ట్‌కార్డు, ఏ4 సైజ్ వరకు గ్రీటింగ్ కార్డులు విక్రయించేవారు. రూపాయి నుంచి రూ.వేల విలువైన కార్డులు మార్కెట్‌లో హల్‌చల్ చేసేవి.

మోయలేని స్థాయిలో వచ్చేవి



డిసెంబర్ వచ్చిందంటే గ్రీటింగ్ కార్డులు, ఉత్తరాలతో పోస్టాఫీసు నిండిపోయేది. ఉదయం నుంచి రాత్రి 10 గంటలవరకు పనిచేయాల్సి వచ్చేది. మోయలేని స్థాయిలో కార్డులు వచ్చేవి. వాటిని బ్యాగుల్లో నింపుకుని సైకిల్‌పై వెళ్లి డెలివరీ చేసేవాళ్లం. గ్రీటింగ్ కార్డు తీసుకునేప్పుడు ఎదుటి వారి ముఖంలో కనిపించే ఆనందం ఇప్పటికీ గుర్తుకు వస్తూనే ఉంటుంది.
- కేఎన్ రావు, రిటైర్డ్ పోస్ట్‌మన్, తిరుపతి

సంతోషంగా ఉండేది



ఆ రోజులు మరువలేనివి. విద్యార్థి దశలో స్నేహితులు, బంధువులకు హ్యాపీ న్యూఇయర్ చెప్పేందుకు ఏటా సుమారు 20 గ్రీటింగ్ కార్డులకు పైగా కొనుగోలు చేసేవాడిని. అందులో నాకు తెలిసిన సందేశం రాసేవాడిని. తిరిగి మా ఇంటికి పదుల సంఖ్యలో గ్రీటింగ్ కార్డులు వచ్చేవి. అవి చూస్తే సంతోషంగా ఉండేది. కానీ, ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ల యుగం నడుస్తుంది. ఫోన్‌లోనే గ్రీటింగ్స్ పంపేస్తున్నారు.
- రమణమూర్తి, రిటైర్డ్ టీచర్

టెక్నాలజీనే బెటర్



గతంలో గ్రీటింగ్ కార్డ్స్‌తో న్యూఇయర్ విషెష్ చెప్పేవారని తెలిసింది. నేను వాటిని ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు బర్త్‌డే, ఫెస్టివల్ వంటి అకేషన్స్‌కు డిజిటల్ మెసేజ్‌లు, కార్టూన్ వీడియోలతో స్పెషల్ సాంగ్స్ మిక్స్ చేసి పంపుతున్నాం. మా ఫ్రెండ్స్ అందరూ ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్, ఎక్స్‌లోనే నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతుంటారు. ఆధునిక టెక్నాలజీనే బెటర్ అనిపిస్తుంది. - శ్వేత, ఇంజినీరింగ్ విద్యార్థిని, తిరుపతి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తిరుపతి క్రైమ్ : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రామచంద్ర స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 31వ తేదీ రాత్రి ఎక్కడపడితే అక్కడ మద్యం తాగితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే 9440902542 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి

చంద్రగిరి : బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజులగారి పురుషోత్తంరెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో దొరస్వామి, కాయం హరినాథ్ రెడ్డి, సుబ్రమణ్య యాదవ్, వెంకటముని, నరేష్ కుమార్ నాయుడు, ముని గంగిరెడ్డి పాల్గొన్నారు.

గోవిందమాల భక్తులకు ప్రాధాన్యమివ్వాలి

తిరుపతి కల్చరల్ : గోవిందమాల ధరించి తిరుమలకు వచ్చిన భక్తులకు శ్రీవారి దర్శనానికి ప్రాధాన్యమివ్వాలని అనంత గోవింద దాస ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవింద ప్రబోధనంద కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏఆయన మాట్లాడారు. అయ్యప్పమాల, భవానీ మాల, ఓం శక్తి మాల, శివమాల ధరించిన భక్తులకు ఆయా ఆలయాల్లో ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే గోవింద మాలధారులకు అవకాశం కల్పించాలని సూచించారు. సమావేశంలో ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు వి.శ్రీధర్, ఎ.కృష్ణదాస్, హరికృష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

మునిరత్నంరెడ్డి మృతికి సంతాపం

తిరుపతి సిటీ :ఎస్వీయూ ఆంత్రోపాలజీ విశ్రాంత విభాగాధిపతి ప్రొఫెసర్ మునిరత్నం రెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ సందర్భంగా వర్సిటీ విశ్రాంత వీసీ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, అధ్యాపకులు నివాళులర్పించారు. సొసైటీ కార్యదర్శి పుట్టామునిరత్నం, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ పేటశ్రీనివాసులరెడ్డి, సభ్యులు గుండ్రే జయచంద్ర, చెంచుమునుస్వామి, ఎం గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఫైన్ ఆర్ట్స్ చాంప్ ఎస్వీయూ



విద్యార్థులతో టీమ్ మేనేజర్, కో-ఆర్డినేటర్

తిరుపతి సిటీ: చెన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజులు నిర్వహిస్తున్న దక్షిణ భారత విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలలో ఎస్వీయూ విద్యార్థులు ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఓవరాల్ చాంప్‌గా నిలిచారు. దీంతో పాటు క్లే మోడలింగ్, పోస్టర్ మేకింగ్ విభాగాలలో ప్రథమ స్థానం, ఇన్‌స్టలేషన్, రంగోలి, మెహందిలో ద్వితీయ స్థానం, క్లాసికల్, ర్యాలీ విభాగాలలో 4వ స్థానం, మరో నాలుగింటిలో 5వ స్థానం సాధించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను, టీమ్ మేనేజర్ మురళీధర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్‌ను వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అభినందించారు. వారు మాట్లాడుతూ, దాదాపు నాలుగు నెలల నిరంతర శ్రమ ఫలితమే వర్సిటీ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో రాబోయే సంవత్సరం దక్షిణ భారత సాంస్కృతిక పోటీలను వర్సిటీలో నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

సేంద్రియ సాగుపై అవగాహన

రామచంద్రాపురం : మండలంలోని రాయలచెరువు కట్ట వద్ద రాయల మండపంలో సోమవారం సేంద్రియ విధానంలో సాగుపై రైతులకు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి అవగాహన కల్పించారు. జీవ నియంత్రణ పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ, యాజమాన్యం, యాంత్రీకరణ విధానాలను వివరించారు. రసాయన ఎరువులను అధికంగా వాడితే భూమి నిస్సారమవుతుందన్నారు. ఘన, ద్రవ జీవామృతాలతో సాగు చేపడితే భూమికి జీవం పోయవచ్చని వెల్లడించారు.

శెట్టిపల్లి వాసులకు షాక్

- లబ్ధిదారుల ఆశలపై నీళ్లు
- 2 సెంట్లు నుంచి 1.5 సెంట్లకు కుదింపు
- రెవెన్యూ సదస్సులో స్థానికుల ఆవేదన



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: శెట్టిపల్లి భూముల లబ్ధిదారులకు అధికారులు షాక్ ఇచ్చారు. గతంలో ఒక్కో లబ్ధిదారుడికి 2 సెంట్లు చొప్పున ప్లాట్స్ కేటాయింపులు చేయాలని నిర్ణయించారు. అయితే తాజాగా 1.5 సెంట్లు మాత్రమే ఇస్తామని అధికారులు తేల్చిచెప్పేశారు. మరోవైపు వ్యవసాయ భూములున్న లబ్ధిదారులకు గతంలో 40శాతం భూమిని అందించి... 60 శాతం భూమిని ప్రభుత్వం అభివృద్ధికి వినియోగించేలా నిర్ణయించారు. అయితే తాజాగా 30 శాతం భూమిని మాత్రమే లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. మిగిలిన 70 శాతం భూమిని స్థానిక అభివృద్ధికి ఉపయోగించనున్నట్లు తెలుస్తోంది.

సమస్య పరిష్కరిస్తాం

తిరుపతి శెట్టిపల్లిలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి నగర కమిషనర్ నారపురెడ్డి మౌర్య, తహసీల్దార్ కేబీ భాగ్యలక్ష్మితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి సాధన సమితితోపాటు పలువురు స్థానికులు, సంఘాల నాయకులు శెట్టిపల్లి భూసమస్యలపై పలు అంశాలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ శెట్టిపల్లికి సంబంధించి 12 పెండింగ్ లేఔట్లలో జనవరి 5 నాటికి నాలుగు లేఔట్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందిస్తామని, అలాగే మిగిలిన రెండు పెండింగ్ లేఅవుట్లను సంక్రాంతి నాటికి పూర్తి చేసిఅందిస్తామని తెలిపారు. 2025 జనవరి 30 నాటికి అధికారికంగా పేపర్ మీద లేఔట్ ప్లానింగ్ చేసి ప్లాట్లను లబ్ధిదారులకు చూపుతామన్నారు. ఎంజాయ్ మెంట్‌లో ఉన్న వారికి ఒకటిన్నర సెంటు భూమి అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే 1,410 మందికి ఇంటి స్థలాలు 74.31 ఎకరాలు ఇచ్చారని, 248 మంది రైతులకు వ్యవసాయ భూములు 137.18 ఎకరాలు, 48 మంది రైతులకు మెట్ట భూములు 46.55 ఎకరాలు ఇచ్చారని వివరించారు. మిగిలిన 147 ఎకరాలలో తుడా సహకారంతో ప్రభుత్వం ఐటీ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్లు రామచంద్ర, అశోక్‌రెడ్డి, ఆర్ఐ రామచంద్రారెడ్డి స్థానికంగా అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సూర సుధాకర్‌రెడ్డి, బాలమునికృష్ణ, సురేష్, అముదాల తులసి, జనసేన నాయకులు రామకృష్ణా, రాజారెడ్డి, బీజేపీ నాయకులు వరప్రసాద్, సీపీఎం నాయకులు జయచంద్ర, రాధాకృష్ణ పాల్గొన్నారు.

రెడ్ బకెట్ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్ : ఎమ్మార్‌పల్లె సర్కిల్ సమీపంలోని మోర్ సూపర్ మార్కెట్ పక్కన రెడ్ బకెట్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష హాజరయ్యారు. రెస్టారెంట్ అధినేతలు పి.సురేష్‌రెడ్డి, జి.రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.


గంగమ్మ హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ హుండీని సోమవారం లెక్కించినట్లు ఈఓ జయకుమార్ తెలిపారు. అమ్మవారికి హుండీ ద్వారా రూ.16,99,916 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

తిరుపతి కల్చరల్ : అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు వామపక్ష నేతలు నిరసన తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో నేతలు వి.నాగరాజు, రామానాయుడు, ఆర్.హరికృష్ణ, టి.సుబ్రమణ్యం, రాధాకృష్ణ, కేవై రాజా, శివ, గోవిందస్వామి, రామచంద్రయ్య, వెంకటరత్నం, వెంకటేష్, వేణుగోపాల్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ



విద్యార్థినులతో దాతలు

చంద్రగిరి : స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులను ఎన్ఆర్ఐ పడిలేటి లక్ష్మీనారాయణ రెడ్డి దంపతులు సోమవారం వితరణగా అందజేశారు. సుమారు రూ.50 వేల రూపాయలు విలువచేసే 400 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణపై ఆగ్రహం



బొమ్మగుంట రవి

తిరుపతి మంగళం : శ్రీకాకుళం జిల్లాలో రజకులను గ్రామ బహిష్కరణ చేయడంపై రజక సంఘం నేతల బొమ్మగుంట రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ న్యాయం అడిగినందుకు ఊరి నుంచి తరిమేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వంలో బడుగు బలహీనవర్గాలను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

తొలి దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

చంద్రగిరి : తొలి దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నివారించవచ్చని కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. సోమవారం స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో కందులవారిపల్లె,, భీమవరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ 30 ఏళ్లు దాటిన మహిళలందరూ తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డీపీఓ సుశీలాదేవి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, డాక్టర్ హరిత, డాక్టర్ చైతన్యభాను, సర్పంచులు రాగిణి, బి.లక్ష్మి, ఉపసర్పంచ్ రాకేష్, కార్యదర్శులు రాజేష్, భానుతేజ్ పాల్గొన్నారు.